ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ఆటో డ్రైవర్లకు 15వేల రూపాయల ఆర్థిక సహాయం అందించే పథకం ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదం తెలిపింది.
- ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు.
- అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు మలేషియా కంపెనీలు ఆసక్తి కనబరిచాయని మంత్రి పి.నారాయణ తెలిపారు.
- కోస్తా జిల్లాల్లో భారీ వర్షాల నేపథ్యంలో పంటల నష్టాన్ని అంచనా వేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.
- తీరం దాటిన వాయుగుండం 24 గంటల్లో క్రమంగా బలహీనపడనుందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది.

====================

ఆటో, క్యాబ్ డ్రైవర్లకు 15వేల రూపాయల ఆర్థిక సాయం అందించే పథకం ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు విజయవాడలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. అమరావతిలోని సచివాలయంలో ఈరోజు ముఖ్యమంత్రి అధ్యక్షతన కేబినెట్ సమావేశమై 20 అంశాలపై చర్చించింది. ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ హబ్స్ (లిఫ్ట్) పాలసీ 2024-29 అనుబంధ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జలవనరుల శాఖకు సంబంధించి వివిధ పనులకు, కారవాన్ పర్యాటకానికి, అమృత్ పథకం 2.0 పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలో వివిధ పనుల వేగవంతానికి స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ఏర్పాటుకు ఆమోదముద్ర వేసింది. అమరావతి సహా రాష్ట్రవ్యాప్తంగా పలు సంస్థలకు భూకేటాయింపుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

====================

ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. అమరావతిలోని సచివాలయం నుంచి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల కలెక్టర్లతో దృశ్య శ్రవణ

మాధ్యమం ద్వారా సమీక్షించారు. ఒడిస్సాలో కురిసిన భారీ వర్షాల కారణంగా వంశధారకు 1.04 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోందని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారని తెలియజేశారు. విశాఖ నగరంలో ఒకరు, శ్రీకాకుళం జిల్లా మందసలో ఇద్దరు, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో ఒకరు మృతి చెందారని అధికారులు వివరించారు. బాధిత కుటుంబాలకు 4 లక్షల రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

====================

అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు మలేషియాకు చెందిన పలు ప్రైవేటు సంస్థలు ఆసక్తి కనబరిచాయని పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. మలేషియా ప్రజాప్రతినిధుల బృందం రాజధాని అమరావతిలో ఈరోజు పర్యటించింది. రాజధానిలోని నిర్మాణాల గురించి.. మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు మలేషియా బృందానికి వివరించారు. రెండున్నరేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. అమరావతిలో రానున్న ఐదేళ్లలో 6వేల నుంచి 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు మలేషియా కంపెనీలు ఆసక్తి కనబరిచాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

====================

ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో భారీ వర్షాల నేపథ్యంలో పంటల నష్టాన్ని అంచనా వేయాలని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ, హార్టి కల్చర్ ఉన్నతాధికారులతో అమరావతిలోని సచివాలయం నుండి మంత్రి ఈరోజు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాయుగుండం ప్రభావం తగ్గిన తరువాత ఉత్తరాంధ్ర జిల్లాలకు ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంటుందని.. విద్యుత్, రెవెన్యూ, పోలీసు, నీటి పారుదల శాఖల అధికారులతో పాటు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. అనంతరం ఈ విషయంపై పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి, ఎస్పీ ఎస్.వి మాధవరెడ్డిలతో ఫోన్ లో మాట్లాడి మంత్రి వరద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

====================

తిరుమల వచ్చే సామాన్య భక్తులకు మరింత మెరుగ్గా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ముఖ్య కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్ చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఈరోజు డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనం, వసతి, అన్నప్రసాదాలు తదితర సౌకర్యాల మెరుగుకు ప్రణాళికా బద్ధంగా పనిచేస్తున్నామన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను భక్తుల సహకారంతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.

====================

విరామం

====================

వస్తు, సేవల పన్ను సంస్కరణలతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో లబ్ది చేకూరిందని వాణిజ్యేతర పన్నుల శాఖ (జిఎస్టి) జాయింట్ కమిషనర్ కల్పన తెలిపారు. ఈరోజు విజయవాడలో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ సెప్టెంబర్ 22వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వస్తు, సేవల పన్ను సంస్కరణల వల్ల ధరలు తగ్గి ప్రజలకు మేలు జరిగిందని పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణలతో సామాన్య ప్రజలకు ఏ విధంగా మేలు జరిగిందనేది ప్రజా ప్రతినిధులు ఇప్పటికే తెలియజేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జిఎస్టి వివరాలను బహిరంగ ప్రదేశాలు, షాపుల వద్ద పొందుపరచాలని విక్రయదారులకు జాయింట్ కమిషనర్ కల్పన తెలియజేస్తూ...

(వాయిస్ బైట్...30 సెకన్లు)

====================

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత గుంటూరు జిల్లా మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో అధికారులతో ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో జరిగిన పోలీసు నియామకాలు, అప్పా గ్రేహౌండ్స్ ఏర్పాటు, పెండింగ్ బిల్లుల అంశాలపై సమావేశంలో చర్చించారు. సమీక్ష అనంతరం, హోం మంత్రి అనిత టెక్ టవర్‌ను సందర్శించారు. అక్కడ శక్తి టీమ్ కాల్ సెంటర్‌ను పరిశీలించి, సిబ్బంది సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళల భద్రత కోసం శక్తి టీమ్ అందిస్తున్న సేవలను మంత్రి అనిత అభినందించారు. ఈ సమావేశంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

====================

గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలనే లక్ష్యంతో పనులు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను, కాంట్రాక్టు సంస్థలను ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో ఈరోజు పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ పనులు పూర్తి కావాలని స్పష్టంచేశారు. ప్రధాన ఎడమ కాలువను 2026 జనవరి నాటికల్లా అనకాపల్లి వరకూ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం, పునరావాసాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

====================

విజయనగరం ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి తెలిపారు. పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక శాసన సభ్యులు పూసపాటి అదితి గజపతి రాజుతో కలసి, కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 5,6 తేదీల్లో ఉత్సవాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

====================

ఒడిశా వద్ద నిన్న తీరం దాటిన వాయుగుండం రాగల 24 గంటల్లో క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా ఆంధ్ర, యానాం లలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఈరోజు అనేక చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ...

(వాయిస్ బైట్...27 సెకన్లు)

=====================

భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య అహ్మదాబాద్ లో జరుగుతున్న తొలి టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో భారత్ పట్టు సాధిస్తోంది. 121 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో ఈ ఉదయం రెండవ రోజు ఆట ప్రారంభించిన భారత్ నిలకడగా ఆడటంతో తొలి ఇన్నింగ్స్ లో భారీ ఆధిక్యం దిశగా పయనిస్తోంది. రెండవ రోజు ఆటముగిసే సమయానికి భారత్ 5 వికెట్లు నష్టపోయి 448 పరుగులు చేసింది.

=====================

=====================